# అమ్మకడుపు చల్లగా - 2

## - గొల్లపూడి మారుతీరావు



స్వర్గీయ గొల్లపూడి మారుతిరావుగారి ఆత్మకథ 'అమ్మకడుపు చల్లగా' ఇప్పటికి పదకొండు సంవత్సరాలుగా మార్కెట్‌లో ఉన్న సంగతి పాఠకులకు విదితమే. అందులో మారుతిరావుగారు 2007 వరకూ తన జీవితంలో జరిగిన సంఘటనలను అత్యంత ఆసక్తికరంగా పాఠకులకు అందించారు. దానికి కొనసాగింపుగా 2007 నుంచి తనజీవితంలోని ముఖ్యమైన సంఘటనలను, క్రిందటి సంవత్సరమే, వ్రాయడం ప్రారంభించారు. అనారోగ్యకారణాలవల్ల దాన్ని పూర్తిచేయలేకపోయారు. ఆయన వ్రాసిన కొద్దిపేజీలను వ్రాసిన వెంటనే, 2018 నవంబర్‌లో, కౌముదికి పంపించారు. పూర్తిచేసి ఉంటే ఆ పుస్తకానికి ఏమి పేరు పెట్టి ఉండేవారో! ఆ అసంపూర్తి రచనను అమ్మకడుపు చల్లగా - 2 గా కౌముది పాఠకులకు ఈ నెల నుంచి ధారావాహికంగా అందిస్తున్నాం.

(గత సంచిక తరువాయి)

**సరిగ్గా రెండు** నెలలకి చెన్నైలో ఒక వర్క్‌షాప్‌ని కమల్ హాసన్ ప్లాన్ చేశారు. ఆగష్టు 12 శ్రీనివాస్ ఫౌండేషన్ సభకి శృతిహసన్‌ని సంధానకర్తగా కావాలని ఫోన్ చేసి అడిగాడు సుబ్బారావు. రాత్రి 8గంటలకి కమల్ ఫోన్ చేశాడు. "నేను మరిచిపోయాను. నాదే తప్పు. క్షమించండి. ఈ నెలాఖరున చెన్నైలో జరిగే స్క్రీన్‌ప్లే వర్క్‌షాప్‌లో మీరు మాట్లాడాలి. ప్లీజ్ యాక్సెప్ట్ మై ఇన్విటేషన్" అన్నాడు.

"ఏం మాట్లాడాలి?"

"అది మీకు నేను చెప్పాలా? మీరేం మాట్లాడితే అది" అన్నాడు.

"అలాక్కాదు. ఏ విషయం, ఎంత వ్యవధి - యివన్నీ తెలిస్తే పేపర్ రాస్తాను"

"ప్రసాద్ ఇన్‌స్టిట్యూట్ హరిహరన్ చేత ఫోన్ చేయిస్తాను" అన్నాడు.

మొత్తం మీద "The unprofessional professional's screen writing" అనే శీర్షికని నేనే నిర్ణయించుకున్నాను. ఈసారి ఆడియన్స్‌లో రితుపర్ణ ఘోష్, శేఖర్ కపూర్, అతుల్ తివారీ, అంజన్ రాజబలి, వీరంతాకాక చెన్నైలో సభ కనుక ఏ కాస్తో నన్ను తెలిసిన విద్యార్థులూ ఉన్నారు. ప్రసంగం బాగా రక్తికట్టింది. ప్రేక్షకుల్లో కొందరు ప్రశ్నలు కూడా సంధించారు. పూనా అనుభవం తర్వాత ఈ సెమినార్‌కి ఐదు మార్కులు ఎక్కువ. ఇంతకూ కమల్ హాసన్ సంతోషపడ్డాడు.

ఆ తర్వాత? దక్షిణాది వారికి అక్కడ ప్రవేశం తక్కువ. హిందీ తెలిసిన, ఒక్క సినిమాతో 'ఆర్టు' సినిమా తీశామని భావించేవారికి ప్రవేశం ఎక్కువ. ఆ తర్వాత ఒకటి రెండు ఆహ్వానాలు ప్రసంగాలకి ఆహ్వానిస్తూ వచ్చిన గుర్తు. కానీ మనసు అటుపోలేదు. పదిమంది తెలిసిన ప్రేక్షకులు నలుగురు అతుల్ తివారీలపెట్టు.

అటు తర్వాతకూడా ఒకటి రెండు సందర్భాలలో మిత్రులు, దర్శకులు టి.ఎల్.వి ప్రసాద్ గారి ద్వారా కె.సి.బొకాడియా నా చేత దర్శకత్వం వహించాలని ఊగినా మనస్సు అటుపోలేదు. తెలిసిన ప్రపంచంలో రాణింపు, తెలియని పరిశ్రమలో తలదూర్చడం కన్నా

గొప్పదనిపించింది. కాగా అప్పటికే 'స్టార్' రచయితగా చెలామణీ అవుతున్న నేను అక్కడ కొత్త వాతావరణంలో ఓనమాలు దిద్దడం రుచించలేదు. నటులు, నటీమణులూ భాష ఎల్లలను దాటి రావడం సుళువు. ఖాదర్ ఖాన్, జావేద్ అఖ్తర్, గుల్జార్ తెలుగులో వ్రాయడం దుస్తరం.

టెలిఫోన్‌లో రకరకాల విన్యాసాలు చేసేవారంటే నాకు చాలా చాలా చిరాకు. కారణం. సాధారణంగా నాకు ఫోన్ చేసేవారిలో సగం మంది నాకు తెలియనివారు తీరా 'నేనెవరో చెప్పుకోండి చూద్దాం' అనే దిక్కుమాలిన ప్రశ్నకి మనకి తెలిసిన వేలాదిమందిలో ఈ గొంతుని వెదుక్కోవడం అదిన్నీ అప్పుడు ఉన్న పరిస్థితిలో చాలా దుర్మార్గమయిన జోక్. నా వయస్సునీ, పెద్దరికాన్ని గౌరవించే వ్యక్తి ముందుగా తనెవరో చెప్పడం అతి సౌకర్యం. కాగా సమంజసం.

మొబైల్ చాలా దుర్మార్గమైన పరికరం. అదాటుగా ఫోన్ మోగినప్పుడు మనం కడుపునొప్పితో బాధపడుతున్నామా? ఇల్లాలితో తగాదా పడుతున్నామా? అప్పులవాడు నెత్తిమీద కుర్చున్నాడా? కొడుకుని సాగదీస్తున్నారా? పొరుగింటాయన మీ మామిడిచెట్టు కొమ్మలు నరికాడా? ఇలా వంద రకాల సమస్యలు ఉండవచ్చు. మొబైల్ హఠాత్తుగా మీతో కనెక్టు అవుతుంది కనుక. ఫోన్ చెయ్యగానే హింసించకుండా మాట్లాడేదెవరో చెప్పడం మర్యాద. నా వయస్సుకీ, పెద్దరికానికీ గౌరవాన్నిస్తున్నట్టు.

అయితే అలా నన్ను ఇబ్బంది పెట్టిన ఇద్దరు ప్రముఖ వ్యక్తుల టెలిఫోన్ కాల్స్‌ని మరిచిపోలేను. చాలా బిజీగానో, మరేదో పనిలోనో ఉన్నప్పుడు మొబైల్ మోగింది. అటునుంచి గొంతు. "నేనెవరో చెప్పుకోండి చూద్దాం" అంతే. అలాంటి సందర్భాలలో మరో ఆలోచనలేకుండా, అతి క్రూరంగా ఆ కాల్‌ని ఆపేస్తాను. అంతేకాదు. ఆ నంబరు గుర్తుంచుకుని ఆ రోజంతా ఆ నంబరు కాల్‌ని తీసుకోను. ఆ క్షణంలో అదే చేశాను. సరిగ్గా రెండు నిముషాల్లో మళ్ళీ ఆ నంబరునుంచి ఫోన్. నా పద్ధతి ప్రకారం కాల్‌ని తీయలేదు. రెండుసార్లు. మూడుసార్లు. కనీసం అరగంట గడిచాక పదే పదే చేస్తున్న ఆ వ్యక్తికాల్ ని తీసుకున్నాను. అటునుంచి కంగారుగా మాట: "ఫోన్ పెట్టెయ్యకయ్యా బాబూ. నేను విశ్వనాథ్‌ని" అని. మిత్రులు కె.విశ్వనాథ్‌గారికి నా పాఠం ఎలా చెప్పను?

మరొక ఫోన్ జోక్. మరో గొప్పమిత్రులు, ప్రముఖులద్వారా.

పరాకుగా ఉన్న నాకు ఒక ఫోన్‌కాల్ వచ్చింది. అటునుంచి "నేను మీ అభిమానిని, మిత్రుడిని, శ్రేయోభిలాషిని" ఇదీ ఆ పలకరింత.

వెంటనే గొంతుని గుర్తుపట్టలేకపోయాను. "ఎవరూ?" అన్నాను.

మళ్ళీ అవే మాటలు: "నేను మీ అభిమానిని, మిత్రుడిని శ్రేయోభిలాషిని"

ఒకటి రెండుసార్లు ఈ మాటలు విన్నాక విసిగి మొబైల్‌ని ఆపుజేశాను.

ఓ గంట తర్వాత ఈ 'అభిమాని' అలిసిపోయాడనుకుంటూ మళ్ళీ మొబైల్‌ని ఆన్ చేశాను. ఒక మెసేజ్ వచ్చివుంది. "నేను గుమ్మడిని. మీకు నేను స్నేహితుడినయితే ఫోన్ చెయ్యండి" అని. తుళ్ళిపడ్డాను. రెండుసార్లూ నాలిక కొరుక్కుని లెంపలు వేసుకున్నాను.

వెంటనే ఫోన్ చేశాను. ఆస్ట్రేలియా తెలుగు సంఘం (మెల్బోర్న్) వారు గుమ్మడిగారికి సన్మానం చెయ్యడానికి ఆహ్వానించారు. ఈయనకి బొత్తిగా ఆరోగ్యం బాగోలేదు. "మీరు వస్తానంటే నేను ఒప్పుకుంటాను. "మీరు వస్తేనే నేను వస్తానన్నాను శ్రీనివాసరావుతో" అన్నారు.

లోగడ నేనూ మా ఆవిడా ఆస్ట్రేలియా వెళ్ళాం. అయిన ఈ ఆహ్వానాన్ని అంగీకరించాను. అయితే అన్ని ఏర్పాట్లూ జరిగాక 14రోజుల తర్వాత గుమ్మడి ఫోన్ చేశారు "పదిరోజుల తర్వాత ఇప్పుడే ఆసుపత్రినుంచి వస్తున్నాను. మీ అందరి ఆశీర్వాదం వల్ల బతికాను. ఇప్పుడున్న పరిస్థితుల్లో అస్సలు రాలేను. నా తరపున మీరే ఆ విషయం అక్కడివారికి చెప్పండి" అన్నారు.

మెల్బోర్న్‌లో గుమ్మడిగారికి పరోక్షంగా సన్మానం జరిగింది. తరువాత శ్రీనివాసరావు దంపతులు హైదరాబాదు వచ్చి అక్కినేని, సినారె, కైకాల సమక్షంలో వారికి ఆ సత్కారాన్ని అందజేశారు.

మెల్బోర్న్‌లో గుమ్మడిగారి గురించి చెప్పాక ప్రేక్షకులతో 'ముఖాముఖీ' నిర్వహించాను. బాగా సాగింది. శ్రీనివాసరావుగారు ఆ టేపుని గుమ్మడిగారికి పంపారు. ఆ టేపుని ఒకటికి రెండుసార్లు విని గుమ్మడిగారు ఫోన్ చేశారు "మెల్బోర్న్ టేపు చూస్తున్నాను. మీ ప్రసంగం అద్భుతం. మీకు సాటిలేరు. 24 సంవత్సరాల కింద మారుతీరావుగారి ఘనతని మళ్ళీ చూస్తున్నాను"

ఇవన్నీ భుజాలు పొంగే కితాబులు కావు. ఆత్మీయుల స్పందనలు.

*( కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments